



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ ఉదయ్, ఎమ్మెల్యే వనమాడి, ఎమ్మెల్సీలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక పోలీసు బృందాలు

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్

ప్రత్తిపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలో రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రత్తిపాడు పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రోడ్డుప్రమాదాలకు మద్యం సేవించి వాహనాలు నడపడమే ప్రధాన కారణమన్నారు. రాత్రి సమయాల్లో కారులు, బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు.వీటి నివారణకు ఏలూరు రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల్లో ప్రతి సబ్‌డివిజన్‌కు ఒక ఎస్‌ఐ, పోలీసులను బృందంగా నియమించి రాత్రిళ్లు హైవేలపై గస్తీ నిర్వహించేలా అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. హైవేలపై వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లు ముమ్మరంగా నిర్వహించడం ద్వారా రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యకూడలి వద్ద ట్రావెల్ బస్సులను, కారులను తనిఖీ చేయడం, డ్రైవర్లతో మాట్లాడడం వంటివి చేయాలని సూచించామని తెలిపారు. చిన్నపిల్లలపై అకృత్యాలకు పాల్పడేవారిపై రౌడీషీట్‌లు తెరుస్తామన్నారు. చిన్నారులపై దాడులకు పాల్పడిన వారిపై కూడా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.పాఠశాలలో గుడ్‌టచ్,బ్యాడ్ టచ్‌పై ఉపాధ్యాయులకు కూడా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రేంజ్ పరిధిలోని గంజాయి రవాణా తగ్గిందని, పూర్తిగా అదుపులో ఉందని అన్నారు. సమావేశంలో ఎస్పీ జి.బిందు మాధవ్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, ప్రత్తిపాడు,ఏలేశ్వరం ఎస్‌ఐలు లక్ష్మీకాంతం, రామలింగేశ్వరరావు, అన్నవరం ఏఎస్‌ఐ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ, సీఐలు

లెక్క తేలింది!



ఇటీవల వర్షాలకు పిఠాపురంలో నీటమునిగిన వరిపంట

- » మొంథా తుఫాన్‌కు జిల్లాలో మొత్తం నష్టం రూ.68కోట్లు
- » అత్యధికంగా వ్యవసాయశాఖ పరిధిలో రూ.53.16కోట్లు
- » 20 మండలాల్లో 47,984మంది రైతులకు 53,530ఎకరాల్లో పంట నష్టం
- » మున్సిపాల్టీల్లో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, డ్రైన్ల నష్టం రూ.10.06కోట్లు
- » విద్యుత్‌శాఖకు వాటిల్లిన నష్టం రూ.2.77కోట్లు
- » ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు: డీఆర్సీలోను చర్చ

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ జిల్లాకు భారీ నష్టాన్ని మిగిల్చింది. అన్నిశాఖల్లో కలిపి రూ.68కోట్ల మేర నష్టం వాటిల్లేలా చేసింది. క్షేత్రస్థాయి పరిశీలనలు, నివేదికల ఆధారంగా ఆయాశాఖలకు వాటిల్లిననష్టంపై అధికారులు ప్రభుత్వానికి పూర్తిస్థాయి నష్టం నివేదికను పంపించారు. అత్య ధికంగా వ్యవసాయశాఖ పరిధిలో 20 మండలాల్లో 53,530ఎకరాల్లో వరిపంట దెబ్బతిందని తేల్చారు. మొత్తం 47,984మంది అన్నదాతలకు చెందిన పంట నష్టపోయిందని నివేదికలో వివరించారు. ఇందుకోసం పరిహారం కింద రూ.53.16కోట్లు విడుదలచేయాలని కోరారు. ఉద్యానవనశాఖ పరిధిలో 421హెక్టార్లలో 1,201మంది రైతులకు చెందిన వివిధ వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయన్నారు. అత్యధికంగా అరటి 99.14 హెక్టార్లలో నష్టపోయినట్లు తేల్చారు. తుఫాన్ నేపథ్యంలో వీచిన భారీ ఈదురుగాలులతో జిల్లాలో మొత్తం ఏడు కచ్చా ఇళ్లు పూర్తినేలమట్టం కాగా, 181పాక్షికంగా నష్టపోయాయని గుర్తించారు. 65 గుడిసెలు ధ్వంసమయ్యాయన్నారు. మత్స్యశాఖ పరిధిలో 6మోటార్‌బోట్లు పూర్తిగా నష్టపోగా వలలు ధ్వంసమయ్యాయని లక్షల్లో నష్టం అంచనా వేశారు. జలవనరులశాఖ పరిధిలో మొత్తం ఏలేరు కాలువలకు సంబంధించి 42చోట్ల గండ్లు పడ్డాయని, ఇందుకు రూ.23.83లక్షలు అవసరం అని కోరారు. రెండుచోట్ల డ్రెయిన్లకు గండిపడగా రూ.34లక్షలు నష్టం వాటిల్లిందని నివేదికలో వివరించారు. జిల్లాలో తుఫాన్ ప్రభావంతో 13.04కి.మి. మేర దెబ్బతినగా, నష్టం రూ.8.46 లక్షలు వాటిల్లిందన్నారు. పంచాయతీరాజ్ పరిధిలో రోడ్లు 13కి.మి. నష్టపోగా రూ.9.32లక్షలు నష్టం వచ్చిందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా కాకినాడ కార్పొరేషన్, వివిధ మున్సిపాల్టీల పరిధిలో 8.2కి.మి.మేర రహదారులు ధ్వంసం అవగా 53బ్రిడ్జిలు, కల్వర్టు తీవ్రంగా దెబ్బతిన్నాయని తేల్చారు. దీంతో నష్టం రూ.10.06కోట్లుగా నిర్ధారించారు. ట్రాన్స్‌కోకు సంబంధించి 33కేవీ ఫీడర్లు 53, 11కేవీ ఫీడర్లు 317, 11కేవీ పోల్స్ 342 దెబ్బతినగా మొత్తం నష్టం రూ.2.77కోట్లుగా తేలిందని వివరించారు. ఇవన్నీ కలిపితే మొత్తం నష్టం రూ.68కోట్లు కాగా, ఉద్యానవనశాఖ, కూలిన ఇళ్లు, ఇతర పరిహారాలు కలిపి నష్టం రూ.80కోట్ల వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని అధికారులు వివరించారు. ఈ మేరకు తుఫాన్ నష్టాలకు సంబంధించి సిద్ధం చేసి పంపిన నివేదికపై మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాసమీక్ష సమావేశంలోను జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ సమక్షంలో చర్చించారు. ఆయా శాఖలకు వాటిల్లిన నష్టాలకు సంబంధించి నిధులు వేగంగా విడుదలయ్యేలా చూడాలని అధికారులు కోరారు. కాగా వరదలు, భారీ వర్షాలకు ఏలేరు, తూర్పు డెల్టా పరిధిలో డ్రైన్లు దెబ్బతినడం, గండ్లకు రూ.2.48కోట్లు తక్షణ అవసరమని అధికారులు వివరించారు. ఈ పనులను అత్యవసరంగా చేపట్టాలన్నారు. వీటి శాశ్వత పూడ్చివేతకు రూ.21.38కోట్లు అవసరమని గుర్తించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉందన్నారు. తుఫాన్ నష్టం తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందం ఎదుట మంగళవారం రాష్ట్రప్రభుత్వం జిల్లాల వారీగా నష్టాలను వివరించి చెప్పింది. సాధ్యమైనంత వేగంగా నష్టం నిధులు కేంద్రం నుంచి విడుదలయ్యేలా చూడాలని కోరింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలను..

సద్వినియోగం చేసుకోవాలి

- » జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ
- » యాంకరేజ్ పోర్టు వద్ద 'పరిశ్రమలు, ఉపాధి కల్పన' ప్రత్యేక కార్యక్రమం
- » వర్చువల్ విధానంలో నాలుగు కంపెనీలకు సీఎం శంకుస్థాపన

కాకినాడ,నవంబరు11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం 20లక్షల ఉద్యోగాల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లివచ్చారని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరి నారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద జిల్లా పరిశ్రమలు, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పరిశ్రమలు-ఉపాధికల్పన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం,కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు ప్రకాశం జిల్లా నుంచి కాకినాడ జిల్లాలోని నాలుగు ఎంఎస్ఎంఈలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కాకినాడ పోర్టులో ఎంఏటీ మెరైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ విస్తరణ, పెద్దాపురంలో సంతోషిమాత కారు గేటర్స్ పరిశ్రమ, శంఖవరంమండలంలోని ఆరెపూడిలో ఓ పరిశ్రమ, తునిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు శిలాఫలకాలను జిల్లా కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాఇన్‌చార్జి మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా పాలసీలు తీసుకొచ్చి సబ్సిడీలు కూడా ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, పరిశ్రమల స్థాపనకు కాకినాడలో ఉన్న ప్రత్యేక వనరులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహాన్ని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలున్నాయని, కాకినాడ పోర్టు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు.

కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మార్గదర్శకత్వంలో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు నూరుశాతం కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22జిల్లాల్లో సీఎం ప్రారంభిస్తున్న ఎంఎస్ఎంఈల్లో కాకినాడ జిల్లాలో నాలుగింటికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ఆరునెలలుగా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన దరఖాస్తు ఒకటి కూడా పెండింగ్ లేదన్నారు. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అభివృద్ధిని ఒక ప్రాంతానికే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్నిప్రాంతాలకు సమాన అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వివిధ కార్యక్రమాలు పెద్దఎత్తున చేపడుతున్నారన్నారు. కాకినాడలో స్థాపించిన పరిశ్రమల నుంచి పెద్ద రహదారులకు అనుసంధానం చేసిచిన్న రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేస్తే మరింత వ్యాపార అభివృద్ధికి దోహదపడుతుందనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రిని కోరారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో 45 దేశాల ప్రతినిధులతో పెద్దఎత్తున సమ్మిట్ నిర్వహిస్తోందని తెలిపారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలను అందించే లక్ష్యంతో పెద్దఎత్తున పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. కాకినాడ పోర్టు నుంచి జలరవాణా పెరిగిన నేపథ్యంలో పోర్టు అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించాలన్నారు. టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి జ్యోతుల నవీన్‌కుమార్, జిల్లాపరిశ్రమలశాఖ జీఎం సీహెచ్ గణపతి, కాకినాడఅర్బన్ తహసీల్దార్ జితేంద్ర, కాకినాడ పోర్టు అధికారి ధర్మశాస్త్ర, కాకినాడ ఎంఏటీ మెరైన్ సెక్రటరీ జేఎన్‌వీ ప్రసాద్ రాజు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మంత్రి నారాయణ, చిత్రంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు.. (ఇన్‌సెట్‌లో) హాజరైన జనం

ఖరీఫ్‌లో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలి

» జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ నిర్దేశిత 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని మించి కొనుగోలుకు పటిష్ఠమైన కార్యాచరణ చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా సమీక్షా కమిటీ 5వ సమావేశం మంగళవారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనెసంచులు, కూలీలు, వాహనాలు, పీపీసీ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో లెగసీ చెత్తతొలగింపుపై సమీక్షించారు. సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలులో ఇప్పటివరకు 12,428 మెగావాట్ల సామర్థ్యం కల్గిన 2200రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటు ద్వారా ఏపీఈపీడీసీఎల్ పరిధిలో జిల్లా అగ్రస్థానంలో ఉందని అధికారులను అభినందించారు. సముద్రంలోకి వృథాగా పోతున్న రెండు టీఎంసీల ఏలేరుజలాలను గరిష్ఠస్థాయిలో వినియోగంలోకి తెచ్చేందుకు ఎమ్మెల్యేల సూచనల మేరకు ఇరిగేషన్ పనులకు రూ.18 కోట్లు, పుష్కరాల నేపథ్యంలో గోదావరి కాలువలపై 11స్నానఘట్టాల అభివృద్ధికి రూ.55లక్షలు నిధులు వచ్చాయన్నారు. ఉప్పాడ, కోనపాపపేటల వద్ద సముద్రతీర కోత నివారణకు రాతి రక్షణగోడ నిర్మాణాన్ని రూ.16కోట్ల నిధులతో చేపట్టేలా మారిటైం బోర్డుకు ప్రతిపాదించామన్నారు.సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జీఎం మాట్లాడుతూ ఖరీఫ్‌లో 2.24లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టగా 5.92లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశామన్నారు. పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు.

ఏలేరులో మట్టి దోపిడీ

» నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా తవ్వకాలు

ఏలేశ్వరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలోని ఏలేరు రిజర్వాయర్‌కు సమీపంలోని మట్టిని దుండగులు దోచేస్తున్నారు. మట్టి తవ్వకాలపై పలువురు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా రాజకీయ ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. వారంరోజులుగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా రాత్రివేళల్లో ఎక్స్‌కవేటర్ సహాయంతో 20కిపైగా ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నా ఇరిగేషన్ అధికారులు ఏమీపట్టనట్లు చోద్యం చూస్తున్నారు. ఏలేరు నుంచి వరద నీరు వచ్చే ప్రాంతానికి సమీపంలోనే మట్టి తవ్వకాలు జరగడంతో స్థానికులు, పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. తవ్వుకుంటూ పోతే ప్రాజెక్టు నుంచి వచ్చే వరద నీరుతో ఏలేశ్వరం పట్టణ, రూరల్ గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ట్రాక్టర్ మట్టి రూ.3వేల నుంచి రూ.4వేల వసూలు చేస్తూ అక్రమార్కులు లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్వకాల ప్రదేశంలో ఫొటోలు తీయడానికి వెళ్లిన విలేఖరులను సైతం అక్రమార్కులు బెదిరించారు.



ఏలేశ్వరంలో ట్రాక్టర్‌తో తరలిస్తున్న మట్టి

రిజర్వాయర్‌కు ముప్పు

ఏలేరు జలాశయాన్ని ఆనుకుని ఉన్న మట్టి కొండలను తవ్వేయడంతో సమీప మండలాలకు వరదలు వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికి 1000 మీటర్ల పరిధిలో తవ్వకాలు నిర్వహించకూడదు. ఏలేరు దగ్గరలోని క్వారీల్లో కొన్నేళ్లుగా పనులు నిలిపివేశారు. మట్టి తవ్వకాలకు ఏలేరు, రెవెన్యూ అధికారులు అడ్డుకట్టు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

గూఢసార్‌లెక్కడ!

ఉమ్మడి జిల్లాలో నిద్దరోతున్న నిఘా



మనలో ఒకడు.. మనతో పాటే ఉంటాడు.. మనలాగే ఉంటాడు.. అనుపానులు చూసుకుంటాడు.. ప్రమాదాన్ని పసిగడతాడు.. ఉన్నతాధికారులకు చేరవేస్తాడు.. ప్రమాదం జరగకుండా కాపాడతాడు.. ఇదీ గూఢచారి వ్యవస్థ.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ గూఢచారి వ్యవస్థ ఉంటుంది.. గతంలో అయితే వీళ్లు ఎవరనేది ఎవరికీ తెలిసేది కాదు.. ప్రస్తుతం గూఢసార్‌లెవరనేది అందరికీ తెలిసిపోతోంది.. నిఘా లేదు.. ఏం లేదు.. ప్రమాదాన్ని పసిగట్టే పనిలేదు.. బాస్‌లకు సేవ చేసుకుంటూ కొసరు పనులతో దర్జాగా గడిపేస్తున్నారు. ఢిల్లీలో బాంబ్ పేలుడు ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది..ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నిఘా వ్యవస్థపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

- » ఢిల్లీ బాంబ్ పేలుడుతో ఉలిక్కిపడిన జిల్లా
- » పోలీసుల తనిఖీలతో భయం..భయం
- » కొసరు పనుల్లో ఉమ్మడి జిల్లా నిఘా విభాగం
- » ప్రమాదాలను పసిగట్టలేని వైనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సాంకేతికత వినియోగం.. నిఘా.. ఈ రెండు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో అత్యంత కీలకమైన భూమిక పోషిస్తాయి. యూనిఫాం వేసుకొని ఎన్నిసార్లు చక్కర్లు కొట్టినా చిక్కని వాటిని నిఘాతో పసిపగట్టి పనిపట్టవచ్చు. ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటన చూస్తే హృదయం కలచివేస్తోంది. పోలీసులు ముందుగా పసిగట్టకుండా ఏం చేస్తున్నారనే ప్రశ్న సర్వత్రా వినవస్తోంది. అయితే యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్, నిఘా వర్గాల సమన్వయంతో పెద్ద ఉపద్రవాన్ని తప్పించాయి. మారణహోమాన్ని మట్టుబెట్టాయి. మరి ఉమ్మడి జిల్లాల్లో నిఘా పటిష్టంగా ఉందా? అనే ప్రశ్నకు మేల్కోవాలనే సమాధానం వినబడుతుండడంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.



రాజమహేంద్రవరంలో వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

నిఘా విభాగం.. ఏం చేస్తుందంటే..

ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో నిఘా విభాగాల పాత్ర కీలకం. పూర్వం వీళ్లను వేగులు, గూఢచారులు అని పిలిచేవారు. పోలీసుల్లో విజిబుల్ పోలీస్.. యూనిఫాం వేసుకొని తనిఖీలు చేస్తుంటారు. యూనిఫాం లేకుండా ప్రజల్లో కలిసిపోయి తీగ లాగడం, కీలక సమాచారాన్ని ఒడిసిపట్టుకోవడం నిఘా విభాగాల (ఇన్‌విజిబుల్ పోలీసింగ్) ప్రధాన విధి. దీని ద్వారా ముందస్తు చర్యలకు మార్గం దొరుకుతుంది. చిన్న నేరాలను నుంచీ భారీ కుట్రలను భగ్నం చేయడం వరకూ వీళ్ల చేతల్లోనే ఉంటుంది. ఢిల్లీ బాంబు పేలుళ్లకు రెండు రోజుల ముందు కీలకమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. గుజరాత్ ఏటీఎస్ పోలీసుల నిఘా విభాగం ఇచ్చిన సమాచారం ఆధారంగా జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్ పోలీసులు, కేంద్ర ఏజన్సీలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఉగ్రవాదులను అరెస్టు చేశారు. భారీ కుట్రను భగ్నం చేశారు. ఇది కేవలం నిఘా విభాగాల వల్లనే సాధ్యపడింది.

నిఘా పెరగాలి..

ఉమ్మడి జిల్లాలో ఎన్నో కీలకంగా ఉన్నాయి.. పోలవరం ప్రాజెక్టు, గోదావరిపై వంతెనలు, పలు ఫ్యాక్టరీలు, ప్రధాన నగరాల్లో సాయంత్రం వేళ జనసమ్మర్థత ఎక్కువే. మెయిన్‌రోడ్లు కిటకిటలాడుతూనే ఉంటాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌ల వద్ద ఈనాటికి మెటల్ డిటెక్టర్ వ్యవస్థ అనేది లేదు. రోజూ సుమారు 40 వేల మంది ప్రయాణించే రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు అయితే చాలా దారులున్నాయి. అయినా నిఘా లేదు. కార్తీకమాసం కావడంతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అక్కడా ఇంతే.

కొసరు పనులతో సరి

పోలీసు శాఖలో ఉండే నిఘా విభాగం కీలకంగా వ్యవహరించాల్సి ఉన్నా అందుకు భిన్నంగా కొసరు పనులు వారికి ఎక్కువైపోయాయనే విమర్శలు ఉన్నాయి. ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ నిఘా (స్పెషల్ బ్రాంచ్-ఎస్‌బీ) పోలీస్ ఒకరు ఉంటారు. జిల్లా స్థాయిలో నిఘా సీఐ, డీఎస్పీకి నేరుగా వీరు సమాచారాన్ని చేరవేస్తూ ఉంటారు. వాళ్ల ద్వారా జిల్లా పోలీస్ బాస్ అయిన ఎస్పీకి.. అవసరమైతే అక్కడి నుంచి పైఅధికారులకు సమాచారం వెళుతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో దాదాపు 75 పోలీస్ స్టేషన్లలోనూ నిఘా పోలీసులు ఉన్నారు. అయితే అధికశాతం వీళ్లందరూ జేబులు నింపు కోవడానికి పాస్‌పోర్టుల తనిఖీలు, ఇతర వ్యవహారాల్లో తల మునకలైపోయారు. ఎస్పీలకు భజన చేయడం, ఉన్నతాధికారుల సమావేశాలకు ఏర్పాట్లు చేయడం, ఆహార మర్యాదల్లో కొరత రాకుండా చూసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం, చివరికి ఉన్నతాధికారి సమావేశంలో కుర్చీ తక్కువైతే వెంటనే రప్పించడం కూడా నిఘా అధికారుల పనిగానే మారిపోయింది. దీంతో అసలు విధులకు సమయం చిక్కడం లేదు. జిల్లాలోని ఎస్పీకి నేరుగా అనుసంధానమై ఉండే ఎస్‌బీ పోలీసులంటే ఆయా పోలీస్ స్టేష న్లలోని సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులు భయ పడుతూ ఉండే పరిస్థితి ఉంది. మూడు జిల్లాల్లోని ఒక జిల్లాలో పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్పీకి దగ్గరగా ఉండే ఎస్‌బీ అధికారులు సీఐలు, ఎస్‌ఐలను బెదిరిస్తూ తమ 'కార్యకలాపాలు' చక్కబెట్టుకుంటున్నారు.

ఇప్పటికైనా ఓ కన్నేసి

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యమే కాకుండా ఇప్పటికైనా నిఘా విభాగాలను ఉన్నతాధికారులు పూర్తిగా పరిశీలించి ప్రక్షాళన చేయాల్సిన అవసరత కనిపిస్తోంది. పోలీస్ స్టేషన్లు, ఎస్పీల వద్ద భజన యూనిఫాంలకు స్వస్తి చెప్పి అనుభవం, నిబద్ధత ఉన్న వారిని నియమించాల్సిన అవసరత కనిపిస్తోంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ ప్రదేశాల్లోని పార్కింగ్ ప్రాంతాల్లో నిఘా పోలీసులను నిరంతరాయంగా వినియోగించాలి. నిఘా (ఎస్‌బీ) విభాగం పోలీసుల పనితీరును బేరీజు వేస్తూ కనీసం నెలకోసారి అయినా సమీక్షిస్తూ ఉండాలి. కీలక సమాచార సేకరణ, వాటిని ఉన్నతాధికారులకు నివేదించడం, ప్రజల్లో మమేకమై సమాచారాన్ని సేకరించడం, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వంటి వాటిపై శిక్షణ ఇప్పించాలి. కొసరు పనులను పక్కన పెట్టించాల్సిన అవసరత కనిపిస్తోంది.

పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపునకు 25 వరకూ గడువు

» డీఈవో పి.రమేష్

కాకినాడరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న పదోతరగతి పరీక్షలను రాయనున్న విద్యార్థులు ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ విడుదల చేసినట్లు కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ తెలిపారు. రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు ఎటువంటి ఆలస్యరుసుం లేకుండా ఈనెల 13నుంచి 25వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.50 ఆలస్య రుసుంతో డిసెంబరు 3 వరకూ, రూ.200 ఆలస్య రుసుంతో డిసెంబరు 10 వరకూ, రూ.500 ఆలస్య రుసుంతో 15 వరకూ పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు లేదా అంతకంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110,వృత్తివిద్యా విద్యార్థులు అదనంగా రూ.60, వయసునిర్ధారణ రుసుం రూ.300 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.ఫీజును www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలని, సీఎఫ్ఎంఎస్ లేదా బ్యాంకు చలాన్ల ద్వారా చెల్లింపులను అంగీకరించరని తెలిపారు.

పెద్దాపురంలో భారీచోరీ

» రూ.5 లక్షల నగదు, అర కాసు బంగారం దొంగతనం

7

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

అపార్ ఐడీతో మెరుగైన సేవలు

నన్నయ యూనివర్శిటీ వీసీ ప్రసన్నశ్రీ


జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాపును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ రిజిస్ట్రీ(అపార్) ఐడీ ద్వారా మెరుగైన సేవలు పొందవచ్చునని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఆధ్వర్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అపార్ వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి ఏబీసీ నోడల్ అధికార్లు, కోఆర్డినేటర్లు, ప్రిన్సిపాల్స్ దాదాపు 300 మంది హాజరయ్యారు. నన్నయ పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి వీసీ ప్రసన్నశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అపార్ అమలుపై ఎన్ఈపీ-2010 కింద విస్తృతమైన, పరివర్తన కలిగించే ప్రక్రియ మొదలైందన్నారు. ప్రతి అభ్యాసకుడికి జీవితాంతం ప్రత్యేకమైన 12 అంకెల గుర్తింపు సంఖ్యగా భావించబడే అపార్ ఐడీ ఒక దేశం, ఒక విద్యార్థి, ఒక గుర్తింపు దార్శనికతను ప్రతిబింబిస్తుందన్నారు. విద్యాసౌలభ్యంతోబాటు పరిపాలనా సౌలభ్యాన్ని అపార్ పెంచుతుందన్నారు. డిజిలాకర్ ద్వారా సురక్షిత యాక్సస్ ద్వారా మార్క్‌షీట్లు, సర్టిఫికెట్లు, డిగ్రీల తక్షణ డిజిటల్ ధ్రువీకరణను ప్రారంభించడం ద్వారా భౌతిక డాక్యుమెంట్లపై ఆధారపడడం తగ్గిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలలు అపార్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమలు చేయడంలో చురుకుగా పాల్గొంటున్నాయని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపాల్ పి.అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అపార్ ఐడీలు నూరుశాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు అందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ సమాచార మంత్రిత్వ శాఖ ప్రాంతీయ కోఆర్డినేటర్ రవి పాండే మాట్లాడుతూ ఆధార్ ఆధారిత ఇ-కెవైసి ధ్రువీకరణ ద్వారా అపార్ ఐడీలను ఉత్పత్తి చేసి ప్రతివిద్యార్థి డిజిలాకర్ ఖాతాకు లింక్ చేస్తున్నారని చెప్పారు. విద్య మౌలిక సదుపాయాలను అమలు చేయడంలో మన రాష్ట్రం ప్రగతిశీల రాష్ట్రాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. కార్యక్రమంలో యాప్షీ అకడమిక్ కన్సల్టెంట్ బి.ఎల్లారెడ్డి, శ్రీకాంత్, నన్నయ పరీక్షల డీన్ ఆచార్య డి.కళ్యాణి, పరీక్షల కంట్రోలర్ ఎస్.లింగారెడ్డి, అడిషనల్ కంట్రోలర్ కె.దీప్తి, సహాయ రిజిస్ట్రార్ ఎస్.విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ ఏపీఎం జ్యోతి పాల్గొన్నారు.

ఏలేరు ఆధునికీకరణపై బహిరంగ చర్చకు రావాలి

వైసీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే వర్మ సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలేరు ఆధునికీకరణకు కృషి చేసింది ఎవరు, అడ్డుకుంది ఎవరు అనే విషయంపై బహిరంగ చర్చకు రావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ వైసీపీ నేతలకు సవాల్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలేరు తదితర అంశాలపై కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏనాడూ పిఠాపురం ప్రజలను పట్టించుకోని గీత ఇప్పుడు చుట్టపుచూపుగా వచ్చి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏలేరు ఆధునికరణ ఫేజ్-1 పనులను టీడీపీ ప్రభుత్వ హయాంలో 75శాతం పూర్తి చేశామని, ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ పనులకు టెండర్ పూర్తి చేసి సీఎం చంద్రబాబుతో శంకుస్థాపన చేయించి పనులు ప్రారంభించామన్నారు. అయితే వైసీపీ నేతలు కుట్ర పన్ని జగన్ ద్వారా సదరు పనులు రద్దు చేయించారని విమర్శించారు.ఐదేళ్ల పాలనలో ఒక అడుగు ముందుకు పడకపోగా, పనులను రద్దు చేసి నిధులు మురిగిపోయేలా చేశారన్నారు. సమావేశంలో ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, బొజ్జా సతీష్, కొండేపూడి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అప్రెంటిస్ అభ్యర్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ ఉత్తీర్ణులైన అర్హులైన అభ్యర్థుల కోసం ఈనెల 13న ఉదయం 8 గంటల నంచి తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ మేళా కోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల్ వర్మ మంగళవారం తెలిపారు. రాజమహేంద్రవరంలోని ప్రముఖ సంస్థ ఏపీ పేపర్ మిల్స్‌లో పనిచేయడానికి ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, టర్నర్ ట్రేడులలో ఐటీఐ పూర్తి చేసిన వారు అప్రెంటిస్‌కు అర్హులని తెలిపారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఒక సెట్ జిరాక్స్ కాపీ, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ అప్రెంటిస్ ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో కాకినాడ మాస్టర్ స్విమ్మర్ల సత్తా


విజేతలను అభినందిస్తున్న డీఎస్డీవో సతీష్‌కుమార్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన 6వ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2025లో కాకినాడ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారని డీఎస్డీవో సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మంగవారం ఆయన కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించారు. డీఎస్ఏ తరఫున రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి విజేతలుగా నిలిచిన మాస్టర్ స్విమ్మర్లను ఆయనతోపాటు కోచ్ అప్పలనాయుడు అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడలకు పూర్తి సహాయ సహకారాలు

కాకినాడ ఎంపీ ఉదయ్


ఎంపీ ఉదయ్‌ను కలిసిన ఎస్జీఎఫ్ కార్యదర్శులు, పీడీలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడలకు తన పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన్ను ఎస్జీఎఫ్ కాకినాడ జిల్లా అడ్మిన్ కార్యదర్శి పి.సుధారాణి, కాకినాడ డివిజన్ కో-ఆర్డినేటర్ లంకా జార్జి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కాకినాడలో స్క్వాష్, జూడో, అండర్-17 బాలురు ఖోఖో, అండర్-14, 17, 19 బాలబాలికలకు జిమ్నాస్టిక్స్, అండర్-11, 14, 17, 19 బాలబాలికలకు స్కేటింగ్, అండర్-19 బాలబాలికలకు హాకీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఎంపీకి వివరించారు. స్క్వాష్, జూడో పోటీలు పూర్తయ్యాయని, మిగిలిన నాలుగింటిని వచ్చేనెల 10వ తేదీలోపు పూర్తిచేస్తామని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవ్వాలని ఆహ్వానించగా తప్పక వస్తారని ఎంపీ తెలియజేసినట్టు వారు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రవిచక్రవర్తి, పీడీలు ఇమ్మాన్యుయల్ రాజు, సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిని ఢీకొన్న బైక్

చికిత్స పొందుతూ మృతి..

మృతుడు మొక్కలతిప్ప వాసి

రాజానగరం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : రాజానగరంలో ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడ్డ బోనం సూర్యనారాయణ(70) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం మొక్కలతిప్ప గ్రామానికి చెందిన సూర్యనారాయణ రాజానగరంలో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి ఐదురోజుల క్రితం వచ్చాడు. సోమవారం సాయంత్రం నడచి వెళ్తున్న సూర్యనారాయణను రాజానగరం ఊరిలో నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన సూర్యనారాయణను తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు పోలీస్‌లు తెలిపారు. ఈ మేరకు మృతుడి కుమారుడు ముత్యాలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జాతీయ పోటీలకు భోగాపురం విద్యార్థినుల ఎంపిక



పిఠాపురం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి పోటీలకు పిఠాపురం మండలం భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో అంతర జిల్లాల స్క్వాష్ పోటీల్లో అండర్-14 విభాగంలో జి.స్తుతి కీర్తన, అండర్-17 విభాగంలో ఆర్.వేణు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. వీరు రాబోయే జనవరి 9 నుంచి 15వ తేదీ వరకూ డిల్లీలో జరిగే జాతీయ స్క్వాష్ పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపికైన బాలికలను, శిక్షణ ఇచ్చిన పీఈటీ సాయిజ్యోతిని పాఠశాల హెచ్ఎం సీహెచ్.సత్తిబాబు, విద్యాకమిటీ చైర్మన్ తోట ఆనందప్రసాద్, సర్పంచ్ నేపాల లక్ష్మి, ఎంపీటీసీ వెన్నపు నీలవేణి, డీవైఈవో సత్యనారాయణ, ఎంఈవోలు అభినందించారు.

అబ్బో! ఎంత పొడుగో!

మలికిపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దిండి గ్రామ సర్పంచ్ ముదునూరి శ్రీనివాస రాజు తన పెరట్లో పెంచిన అరటి చెట్టు సుమారు ఏడు అడుగుల పొడవున గెల వేసింది. ఇది చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంది. తమ బంధువులు మాల్దీవుల నుంచి అరటి మొక్కను తీసుకురాగా వారి వద్ద నుంచి ఒక పిలకను సేకరించి తన పెరట్లో వేసినట్టు రాజు చెప్పారు. ఇది తయారు కావడానికి సుమారు సంవత్సర కాలం పడుతుందని, పది అడుగుల వరకు గెల పెరుగుతుందని తెలిపారు. ఇది చూడడానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటుందన్నారు. దీనిపై కొవ్వూరు అరటి పరిశోధన సంస్థ సైంటిస్ట్ కె.రవీంద్రను వివరణ కోరగా ఇది పిసంగ్ సెరిబు రకం. ఈ రకములో మొగ పువ్వు ఉండకపోవడం వల్ల గెల అంతా ఆడ పువ్వులు(అరటి కాయలు) వచ్చి ఆకర్షణీయంగా కనపడుతుందన్నారు. ఇది మలేషియా, ఇండోనేషియాల్లో పెరుగుతుందని, దీన్ని అలంకరణ కోసం వాడతారు. ఈ గెలలో 200 పైబడి అత్తాలు, సుమారు వెయ్యి కాయల వరకు ఉంటాయని తెలిపారు.



రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్

రన్నరప్ తూర్పు


రన్నరప్ బహుమతి అందుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ క్రీడాకారులు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఆర్‌డీటీ స్టేడియంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకూ జరిగిన 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్-2025లో తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ విభాగం జట్లు పలు విభాగాల్లో రన్నర్ అప్‌గా నిలిచాయి. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో కడియం తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, రాజానగరం సీఎస్‌డీటీ జి.బాపిరాజు జట్టు రన్నర్ అప్‌గా నిలిచారు. వాలీబాల్ లోనూ జిల్లా జట్టు రన్నర్ అప్‌లో నిలిచింది. స్పీడ్‌వాకింగ్‌లో రాజానగరం సీఎస్‌డీటీ జి.బాపిరాజు ద్వితీయస్థానం సాధించారు. ఈ సందర్భంగా క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచిన జిల్లా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులను కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘా స్వరూప్ అభినందిస్తూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ఆరోగ్యం పెరుగుతుందని, మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. విధి నిర్వహణలోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు

అనూ ఇమ్మాన్యుయేల్



'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.


కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేసే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

క్షేమంగా దొరికింది!

- బాలికను కాపాడిన మాలధారులు
- అమలాపురంలో కిడ్నాప్ అయిన బాలిక
- పి.గన్నవరం మండలం యర్రంశెట్టి వారి పాలెం వద్ద ఆచూకీ గుర్తింపు
- తల్లికి అప్పగించిన పోలీసులు
- పరారీలో కిడ్నాపర్

అమలాపురం/పి.గన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో కిడ్నాప్ అయిన పదేళ్ల బాలికను పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలెం వద్ద కొందరు మాలధారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాలికను త ల్లికి క్షేమంగా అప్పగించడంతో కథ సుఖాంతమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న వైసీపీ నాయకుడు కముజు రమణ కుమార్తె నిషిత (10) ఇంటికి సమీపంలోనే ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో 5వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం స్కూలు నుంచి రమణ సమీప బంధువైన పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన మట్టపర్తి మీరా సత్యమూర్తి (చంటి) బాలికకు మాయమాటలు చెప్పి మోటారుసైకిల్ ఎక్కించుకుని తీసుకెళ్లిపోయాడు. పాప ఇంటికి రాకపోవడంతో స్కూలు యాజమాన్యాన్ని ఆరా తీసిన కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యమూర్తి బాలికను కాకినాడ తీసుకెళ్లి సెల్‌ఫోన్, సిమ్ కార్డు కొనుగోలు చేసే క్రమంలో బాలిక ఏడవడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కాకినాడ, అమలాపురం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే కిడ్నాపర్ కాకినాడ నుంచి మండపేట, రావులపాలెం మీదుగా పి.గన్నవరం మండలంలోని ఆర్.ఏనుగుపల్లి శివారు కారుపల్లికి చేరుకున్నాడు. అక్కడ రాత్రి ఓ కొబ్బరితోటలో బాలికతో దాక్కున్నాడు. స్కూలు బ్యాగులు, షూలు వదిలి కాలినడకన ఆర్.ఏనుగుపల్లి నుంచి వేకువజామునే బయలుదేరి పి.గన్నవరం జంక్షన్ మీదుగా బెల్లంపూడి దగ్గరలోని యర్రంశెట్టివారిపాలెనికి బాలికను తీసుకెళ్లాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న ముంగండకు చెందిన కొందరు మాలధారులు సోషల్ మీడియా ద్వారా బాలిక కిడ్నాప్ విషయం తెలియడంతో ఆ బాలికను గుర్తుపట్టి సత్యమూర్తిని ప్రశ్నించడంతో బాలికను వదిలేసి పరారయ్యాడు. అప్పటికే పోలీసులకు సమాచా రం అందడంతో బాలికను తల్లికి అప్పగించారు. బాలిక ఆచూకీ కోసం కృషి చేసిన డీఎస్పీ ప్రసాద్, అమలాపురం సీఐ వీరబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు. బాలిక సత్యమూర్తికి వరుసకు మేనకోడలు అవుతుందని సమాచారం. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.


బాలికను తల్లికి అప్పగిస్తున్న అమలాపురం డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు

బాలబాలాజీ ఆదాయం రూ.42.90 లక్షలు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మామిడికుదురు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీస్వామి హుండీ ఆదాయం రూ.42,90,035 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలను మంగళవారం లెక్కించగా 73 రోజులకు గాను రూ.42,90,035 ఆదాయంతో పాటు 4 గ్రాముల బంగారం, 35 గ్రాముల వెండి వచ్చినట్టుగా ఏసీ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణాధికారి జిల్లా దేవాదాయ శాఖాధికారి వి.సత్యనారాయణ హాజరయ్యారు. లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుడి సన్నిధిలో సత్యదీక్షాపరులతో పడిపూజ

రాత్రి 8 గంటలకు ప్రారంభం

దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 27రోజులపాటు అత్యంత నియమనిష్ఠలతో సత్యదీక్షలు స్వీకరించిన దీక్షాపరులతో పాటుగా అయ్యప్ప దీక్షాపరులతో బుధవారం రాత్రి పడిపూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి 8 గంటలకు పడిపూజ ప్రారంభమవుతుంది. కార్యక్రమానికి దూరప్రాంత సత్యదీక్షాపరులు, గిరిజన దీక్షాపరులు ఇరుముడులు స్వీకరించి రత్నగిరికి చేరుకుంటారు. బుధవారం రాత్రికి కొండపై బస చేసి గురువారం వేకువజామున సత్యదేవుడికి ఇరుముడులు సమర్పించి దీక్షా విరమణ చేయనున్నారు. దీక్షా విరమణలకు అన్న వరం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.

అదృశ్యమైన పదో తరగతి విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగింత

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో అదృశ్యమైన పదో తరగతి విద్యార్థి యాళ్ల నిహార్ ఆచూకీని ఎస్ఐ లక్ష్మీకాంతం కనిపెట్టి మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిహార్‌ను తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లాలని మందలించడంతో సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన విషయం తెలిసిందే. దీనిపై ఎస్ఐ లక్ష్మీకాంతం విస్తృత గాలింపు నిర్వహించి సామర్లకోటలో ఉన్న నిహార్‌ను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి అతడి తల్లిదండ్రులు యాళ్ళ చిన్నారావు, అనంతకు అప్పగించారు.

రూ.5 లక్షల నగదు, అర కాసు బంగారం చోరీ

పెద్దాపురంలో ఘటన

పెద్దాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలోని బ్యాంకు కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పెంకే సింహాచలం ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.5 లక్షల నగదు, అర కాసు బంగారం దోచుకెళ్లినట్టు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఇంట్లో అందరూ బంధువుల ఫంక్షన్‌కు వెళ్లడంతో ఎవరూ లేరని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో నగదు, బంగారం దోచుకెళ్లినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు.

ఇరిగేషన్ ఎస్ఈ పరిశీలన

కిర్లంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం ముక్కోలు బెడ్ రెగ్యులేటర్ వద్ద వాలు కాలువ క్రాడ్ బండ్ కొట్టుకుపోయింది. దీన్ని మంగళవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్ పరిశీలించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబుతో కలిసి ఏలేరు వాలు కాలువ వెంబడి ఉన్న గట్లను పటిష్టం చేసేందుకు శాశ్వత పరిష్కారం చూపుతామని.. దీనిలో భాగంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఇరిగేషన్ డీఈ రవికుమార్‌ను కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. ముక్కోలు గ్రామ సర్పంచ్ జ్యోతుల రాంబాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్, అనపర్తి సూరిబాబు ఉన్నారు.


వాలుకాలువ గట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ గోపినాథ్

శబరిమలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్పస్వామి దర్శనం కోసం శబరిమల వెళ్తున్న భక్తులకు రైల్వే శాఖ శుభవార్త అందించింది. విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్, హైదరాబాద్, కాచిగూడ, కాకినాడల నుంచి కొల్లాం, కొట్టాయంలకు పెద్దసంఖ్యలో ప్రత్యేక రైళ్ల సర్వీసులను ఏర్పాటుచేసింది. అందులో కాకినాడ నుంచి సామర్లకోట మీదుగా ఏర్పాటుచేసిన 18 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల వివరాలను రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తన కార్యాలయం ద్వారా ప్రకటించారు. భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను సామర్లకోట మీదుగా నడుపుతున్నట్టు రైల్వే ఉన్నతాధికారులు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు వచ్చిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది.

07109 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాకినాడ-కొట్టాయం మధ్య ప్రతీ సోమవారం కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరనుంది. ఈ రైలు మంగళవారం 5.30 గంటలకు కొట్టాయం చేరుకోనుంది. నవంబరు 17 నుంచి 2026 జనవరి 19 వరకూ నడవనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నవంబరు 17, డిసెంబరు 1,8,15,22,29, జనవరి 5,12,19 తేదీల్లో 9 ట్రిప్పులుగా ప్రతీ సోమవారం నడువనుంది. ఈ రైలు కాకినాడలో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి సామర్లకోటకు మధ్యాహ్నం 1.20 గంటలకు చేరుతుంది. రాజమహేంద్రవరం నకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుని నిడదవోలుకు 2.35 గంటలకు చేరుతుంది.

07110 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ కొట్టాయం-కాకినాడ మధ్య ప్రతీ మంగళవారం కొట్టాయం నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరనుంది. ఈ రైలు మరుసటి రోజు అర్ధరాత్రి 12 గంటలకు కాకినాడకు చేరుకోనుంది. నవంబరు 18 నుంచి 2026 జనవరి 20 వరకూ నడువనున్న ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నవంబరు 18, డిసెంబరు 2,9,16,23,30 జనవరి 6,13,20 తేదీలలో 9 ట్రిప్పులుగా ప్రతీ మంగళవారం నడువనుంది. ఈ రైలు నిడదవోలుకు రాత్రి 8.37 గంటలకు చేరుకుని రాజమహేంద్రవరానికి రాత్రి 9.22 గంటలకు, సామర్లకోటకు రాత్రి 9.52 గంటలకు, కాకినాడకు రాత్రి 12 గంటలకు చేరుతుంది.

ఈ ప్రత్యేక రైళ్లు సామర్లకోట, రాజమహేంద్రవరం, నిడదవోలు, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలారిపెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొడనూర్, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకుళం మీదుగా కొట్టాయం చేరుకుంటాయి. మొత్తం 1,319 కిలోమీటర్ల దూరంలో 26 స్టేషన్లలో ఆగనున్నాయి. రైళ్లల్లో ప్రయాణించే అయ్యప్ప భక్తులు తమ సమీప రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయంలో రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని పీఆర్వో కార్యాలయం నుంచి ప్రకటించారు.

చిన్నారి తల్లి.. మనసు తల్లడిల్లి..

- కొడుకుని స్కూల్ బస్సు ఎక్కిస్తుండగా తల్లి వెనకాల వచ్చిన కుమార్తె
- బస్సు కింద పడి చిన్నారి మృతి


మృతిచెందిన చిన్నారి హరిణి

ఆత్రేయపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్సు కింద పడి ప్రమాదవశాత్తు మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరుకు చెందిన నాగిరెడ్డి రాజు- సురేఖ దంపతులకు కమారుడు పవన్, కుమార్తె హరిణి వరలక్ష్మి (3) సంతానం. పవన్ ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌లో ఎల్‌కేజీ చదువుతున్నాడు. మంగళవారం తల్లి సురేఖ కుమారుడు ఉదయ పవన్‌ను స్కూల్ బస్సు ఎక్కించేందుకు రోడ్డు మీదకు వచ్చింది. ఆమె వెనకాల కుమార్తె కూడా వచ్చింది. ఆ విషయం తల్లి గమనించలేదు. పవన్‌ను స్కూల్ బస్సు ఎక్కడంతో ముందుకు కదిలింది. బస్సు వెనుక వైపు హరిణి ఉన్నట్టు బస్సు డ్రైవర్ గుర్తించకపోవడంతో వెనక చక్రం కింద పడి చిన్నారి హరిణి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందడతో సురేఖ బోరున విలపించింది. ఎస్ఐ రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. సురేఖ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. వెలిచేరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైల్వే స్టేషన్లో 5 కిలోల గంజాయి స్వాధీనం

యువకుడి అరెస్ట్


గంజాయితో వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.25 వేల విలువైన 5 కిలోల గంజాయిని సామర్లకోట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలో జరిగిన భారీ పేలుడు నేపథ్యంలో రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానితుడిగా ఉన్న వ్యక్తి వద్ద బ్యాగ్‌లను సోదా చేయడంతో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 25 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న జార్ఖండ్‌కు చెందిన బిట్టు కుమార్‌యాదవ్ (26)ని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు ఆర్పీఎఫ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, జీఆర్పీ ఎస్ఐ వాసు తెలిపారు. అతడిని బుధవారం విజయవాడ రైల్వేకోర్టులో హాజరుపరుస్తామన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

గండేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం పంచాయతీ రామేశ్వరంలో ఉన్న పవర్‌గ్రిడ్‌లో పనిచేస్తున్న మానస్ పాండా, నాగేంద్రకు విద్యుత్ షాక్ తగిలి గాయాలయ్యాయి. వారిని పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. పాండా ఒరిస్సా, నాగేంద్ర సూరంపాలెంకు చెందిన వారిగా సమాచారం.


పెద్దాపురంలో ఆసుపత్రిలో బాధితులు



తాళ్లూరులో సినిమా షూటింగ్

గండేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండల తాళ్లూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం మంగళవారం సినిమా షూటింగ్‌తో సందడిగా మారింది. కన్నడ హీరో చందు, హీరోయిన్ సునీత నటిస్తున్న జాజారా చిత్ర సన్నివేశాలను డైరెక్టర్ ప్రభు చిత్రీకరించారు. గజేంద్రపుష్కరిణిలో ఫైటింగ్ సీన్లు తీశారు. ఈ హీరో హీరోయిన్లు కన్నడలో పలు చిత్రాల్లో నటించారని, తెలుగులో తొలి పరిచయమని.. తర్వాత మురారి, రామచంద్రపురంలో షూటింగ్ జరుగుతుందని యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. షూటింగ్ తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.


షూటింగ్ నిర్వహిస్తున్న చిత్రబృందం

బైక్ చోరీలు చేస్తున్న ముగ్గురు మైనర్ల అరెస్ట్

రూ.5 లక్షల విలువైన 6 ద్విచక్రవాహనాల స్వాధీనం : అన్నవరం ఎస్ఐ


పట్టుబడ్డ వాహనాలతో అన్నవరం పోలీసులు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర అలవాట్లకు బానిసై బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్లను మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం జాతీయ రహదారిపై అరెస్ట్ చేసినట్టు అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో వారి నుంచి రూ.5 లక్షల విలువైన 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిని జువైనల్ ప్రొబేషనరీ అధికారి ముందు హాజరుపరిచినట్టు తెలిపారు.

అన్నవరంలో పోలీసులు అప్రమత్తం

ఢిల్లీ ఘటన నేపథ్యంలో తనిఖీలు

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేళుళ్ల ఘటన నేపథ్యంలో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానానికి వేలాదిగా భక్తులు వస్తున్నందను జిల్లా ఎస్పీ ఆదేశాలతో అన్నవరం పోలీసులు అప్రమత్తం అయ్యారు. గ్రామంలో ఉన్న ప్రైయివేట్ లాడ్జిలను తనిఖీ చేయడంతో పాటుగా ఆర్టీసీ కాంప్లెక్స్, పార్శిల్ కార్యాలయాలు, వాహన తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రదేశాల్లో ఎవరైనా బ్యాగ్‌లు మరిచిపోయినా, వదిలిపెట్టి వెళ్లిపోయినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. లాడ్జిల్లో ఎవరు దిగుతున్నారు వంటి పూర్తి వివరాలు తప్పనిసరిగా రికార్డు చేయాలని కోరారు. తనిఖీల్లో అన్నవరం ఎస్ఐ హరిబాబు తదితరులు ఉన్నారు.


అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

కాకినాడలో ట్రక్ క్యాబిన్ దగ్ధం

రూ. 20 లక్షల ఆస్తినష్టం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాకినాడ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి వస్తున్న 40 ఫీట్ ట్రైలర్ ట్రక్ వాహనం క్యాబిన్ షార్ట్ సర్క్యూట్‌కు గురై దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ నుం చి కాకినాడకు హోర్డింగ్ మెటీరియల్‌తో వస్తున్న ట్రైలర్ ట్రక్ కాకినాడ సమీపంలో ఉన్న ప్రతాప్‌నగర్ వంతెన వద్దకువచ్చేసరికి వాహనం క్యాబిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడి వ్యాపించాయి. వెంటనే వాహన డ్రైవర్ అతడి సహాయకుడు బయటకు దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. అది గమనించిన స్థానికులు అగ్ని మాపక శాఖకు సమాచారం ఇచ్చారు. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సిబ్బంది, ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే క్యాబిన్ ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. ఆస్తినష్టం సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఏడీఎఫ్‌వో తెలిపారు.

హరోంహర..

కత్తిపూడిలో వైభవంగా తీర్థకావిడి ఉత్సవం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు, అభిషేకాలు




కత్తిపూడిలో ఊరేగింపు


కలశాలు తీసుకెళుతున్న మహిళలు

శంఖవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తీర్థకావిడి ఉత్సవం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యుడి మాలధారులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఈ వేడుక జరిగింది. తెల్లవారుజాము నుంచి స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కలశాలతో తీర్థకావిళ్లను అనుసరించి గ్రామోత్సవం నిర్వహించారు. కలశాలతో తీసుకువచ్చిన జలాలతో మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. హరోంహర నామంతో గ్రామం మార్మోగింది. కోలాటం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ గాబు గంగ భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. రోడ్డు డెవలప్మెంట్ బోర్డు డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు ఉన్నారు.

అపీత కుచాంబకు ధాన్యాలంకరణ

ప్రత్తిపాడు మండలం రాచపల్లి అరుణాచల క్షేత్రంలో పంచామృతాభిషేకాలు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అరుణాచల క్షేత్రంలో కొలువైన అపీత కుచాంబ అమ్మవారికి మంగళవారం ధాన్యాలంకరణ చేశారు. కార్తీక బహుళ షష్ఠి పురస్కరించుకుని అమ్మవారి ఆలయ గుమ్మానికి వరి కంకులతో కూడిన ధాన్యం గుత్తులు వేలాడ దీసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అరుణాచలేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భారత మాత హోమాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రమానంద ఆధ్వర్యంలో వేద పండితులు పుష్కరిణి వద్ద హారతులు ఇచ్చారు. ధ్వజ స్తంభం వద్ద ఆకాశ పూజలు నిర్వహించారు.




ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో పుష్కరిణి వద్ద హారతులు ఇస్తున్న మహిళలు, అపీత కుచాంబ అమ్మవారికి ధాన్యాలంకరణ

బాలల దినోత్సవ కార్టూన్ పోటీలు

పెద్దాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 14న కార్టూన్ పోటీలు నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు బుద్దా శ్రీనివాస్, కూనిరెడ్డి అరుణ తెలిపారు. పెద్దాపురం, సామర్లకోట విద్యార్థులు పాల్గొనవచ్చని, ఈ నెల 12వ తేదీ సాయంత్రంలోగా వాట్సాప్ లేదా నేరుగా కార్టూన్ గీసిన షీట్‌ను 9989596865, 9848205006, 9000695301 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. 14న బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం


కాకినాడలో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే కొండబాబు


సామర్లకోటలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆజాద్ జీవిత విశేషాలను వివరిస్తున్న హెచ్ఎం సాయిరామకృష్ణ


కాకినాడలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

కాకినాడ క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యా శాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని మంగళవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఎస్పీ బిందుమాధవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, గొప్ప విద్యావేత్తగా దేశ చరిత్రలో చిరస్మరణీయుడన్నారు. ఆయన బోధించిన సమానత్వం, సహనం, జ్ఞానం, జాతీయ ఏకత వంటి విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాస్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): పోర్టు కస్టమ్స్ జెట్టీ వద్ద మౌలానా అబుల్ కలామ్ అజాద్ చిత్రపటానికి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు.

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 138వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మన దేశంలో ఆధునిక విద్యకు ఎలా పునాది వేశారో ప్రిన్సిపాల్ డాక్టర్ అనంతలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీతామహాలక్ష్మి, పావనిదేవి, సువర్చల, భానుతేజ, భువనేశ్వరి పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ వి.కేశవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డీవీ కాశీవిశ్వనాథం, శోభన్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతిని పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రి, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా జీవిత విశేషాలను, ఆయన విద్యావ్యాప్తికి తీసుకున్న పలు సంస్కరణలను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సాయిరామకృష్ణ వివరించారు. ఒక వ్యక్తిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి మార్చేది చదువు మాత్రమేనన్నారు. విద్యార్థులకు సోషల్ టీచర్ల ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ పోలింగ్ నిర్వహించారు. ఉపాధ్యాయులు కేజీ భవాని, బీఆర్ఎస్ శివకుమార్, నల్లల హరి నాథ్, నిర్మల, పద్మావతి, సయ్యద్ ఉస్నీసాబేగం, పి.బ్రహ్మానందం, ప్రవీణ, త్రివేణి, సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.


కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి డిగ్రీ కళాశాలలో...


బాధ్యతలు చేపడుతున్న శేఖర్

కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శేఖర్

కాకినాడ సిటీ, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బచ్చు శేఖర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తన చాంబర్‌లోని రిజిస్టరులో సంతకం చేశారు. ఈ ప్రక్రియను మార్కెట్ కమిటీ కార్యాలయ ఇన్‌చార్జి బి.విజయరామరాజు పూర్తి చేయించారు. టీడీపీ నాయకులు అద్దేపల్లి గంగరాజు, చెక్కా ప్రకాష్, దంగేటి సతీష్, పాలిక నాని, సోమిశెట్టి కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్యదర్శి ప్రతాప్

ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కాకినాడ శశికాంత్ నగర్‌లోని సహకార నిలయంలో మంగళవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా ఎన్‌వీఎస్ ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్, కార్యదర్శిగా కె.ప్రతాప్ కుమార్, కోశాధికారిగా ఎస్.రవికుమార్, సహాధ్యక్షుడిగా డి.బాపిరాజు, ఉపాధ్యక్షుడిగా జీఎస్వీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా పి.ఉమాశంకర్, సీహెచ్ స్వరూపరాణి, కేడర్ కార్యదర్శులుగా ఎస్కే అన్సర్‌వల్లీ, ఎం.సుధీర్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మురళీసత్యనారాయణ వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీవీ ఫణిపేర్రాజు, ఉపాధ్యక్షుడు పి.దుర్గాప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.


మంత్రి నారాయణకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

టీడీపీ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలతో మంత్రి సమీక్ష

కాకినాడ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని టీడీపీ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలతో మున్సిపల్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ సమీక్షించారు. కాకినాడలోని టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ నివాసంలో మంగళవారం సమావేశం జరిగింది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం నిర్దేశించిన తేదీల ప్రకారం ఏడు నియోజకవర్గాల్లో ప్రమాణస్వీకారోత్సవాలు జరగాలని మంత్రి సూచించారు. నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు ఇచ్చిన వినతులను పరిశీలించారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జిల్లా నాయకులు తోట నవీన్, రాజా సూరిబాబురాజు, వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావులతో పాటు పలువురు పాల్గొన్నారు.


ఉత్తమ ప్రదర్శనలను కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లను అభినందిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఆదర్శ డ్రైవర్లు, కండక్టర్లకు అభినందన

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డిపోలో ఆదర్శ ఉద్యోగులుగా నిలిచిన కండక్టర్లు, డ్రైవర్లను మంగళవారం కాకినాడ డిపో గ్యారేజీలో అభినందించారు. అక్టోబరులో అత్యధిక ఆదాయం సాధించిన కండక్టర్లు, అత్యధిక మైలేజ్ సాధించిన డ్రైవర్లకు, ఉత్తమ పనితీరు ప్రదర్శించిన మెకానిక్‌లకు ప్రశంసాపత్రాలతో పాటు, క్యాష్ అవార్డులు అందజేశారు. కాకినాడ డిపో మేనేజరు ఎంయూవీ మనోహర్ అధ్యక్షతన జరిగిన సభలో అసిస్టెంట్ మేనేజరు టి.బాలకృష్ణ, గ్యారేజ్ ఇన్‌చార్జి ఎంవీ రమణ, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, అధిక సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు: సీహెచ్ ప్రకాష్‌రెడ్డి, జి.రాంబాబు, ఎంఎన్ రావు, జీవీ రమణ, వీవీ రెడ్డి, జి.సూర్యచంద్ర, ఆర్.స్వామి, మొహిద్దినాలి, ఎంవీఎస్ తేజ, వీవీఎస్ రావు

నగరంలో కుక్కల బెడద నివారణకు చర్యలు

ఇన్‌చార్జి కమిషనరు సుధాకర్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో కుక్కల బెడద నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన ఎన్టీఆర్ నగర్ సమీపంలోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్‌తో కలిసి పరిశీలించారు. రోజువారీగా ఎన్ని కుక్కలకు ఆపరేషన్లు జరుగుతున్నాయి, షెల్టర్‌లో ఎన్ని కుక్కలు ఉన్నాయన్న వివరాలను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను కూడా పరిశీలించిన సుధాకర్ అక్కడి సౌకర్యాలపై స్నాప్ ఏజెన్సీ హెడ్ శ్యామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రోజుకు 20-25 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్రం స్థలం తక్కువగా ఉందని, మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని గుర్తించిన కమిషనరు సదుపాయాల పెంపుపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

టెన్త్ పరీక్షలకు సన్నద్ధమవ్వాలి: డీవైఈవో సత్యనారాయణ

పిఠాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం కావాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఆయన డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావుతో కలిసి మల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థులకు సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. మల్లాంలో టెన్త్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అవసరమైన వసతుల కల్పనపై పరిశీలన జరిపారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వెనుకబడిన వారికి తర్ఫీదు ఇవ్వాలన్నారు. హెచ్ఎం గాజుల మురళీభాస్కర్, హిందీ ఉపాధ్యాయుడు విసరపు వాసు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు కృష్ణగోపాల్ లునానికి సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్ పార్క్ ఫిట్ నెస్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం వందేమాతరం 150 సంవత్సరాల సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుడు కృష్ణగోపాల్ లునానిని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు శాలువాతో సత్కరించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, కేటీ ప్రతాప్, కార్యదర్శి కలిదిండి శ్రీనివాస్, కోశాధికారి దొరబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రవీణ్, సాంస్కృతిక కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

చేబ్రోలులో ఏఎస్పీ విచారణ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులో జరిగిన స్థల వివాదంపై మంగళవారం సాయంత్రం కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ పరిశీలన జరిపారు. ఈ వివాదంలో భాగంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై ఆయన విచారణ జరిపారు. ఫిర్యాదిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ వెంట పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ వున్నారు.

ఎంఎస్ఎన్ చారిటీస్ విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం


26ఏళ్ల తర్వాత కలిసిన సందర్భంగా అప్పటి గురువులతో విద్యార్థుల గ్రూప్ ఫొటో

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ప్రముఖ విద్యా దాత మల్లాడి సత్యలింగం నాయకర్ హైస్కూలు 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 26 సంవత్సరాల తర్వాత కలిశారు. మంగళవారం వారు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ముందుగా విద్యా దాత మల్లాడికి అంజలి ఘటిస్తూ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 90 మంది అలనాటి స్నేహితులను గుర్తుపడుతూ సరదాగా గడిపారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు ఒకరినొకరు చూసుకుని భావోద్వేగానికి గురయ్యారు. గురువులకు పాద పూజ చేశారు. అలనాటి ఉపాధ్యాయులు ముష్టి ప్రకాశరావు, రవీంద్రనాథ్, తాతబ్బాయి, సుబ్బారావు, సంపత్‌కుమార్, సూర్యకాంతం, ఉమాదేవి, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, అభిలాష్‌లను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు మాట్లాడుతూ నాటి గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈరోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని చెప్పారు. ఆత్మీయ సమ్మేళనానికి కారకులైన తోటి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే కొండబాబుకు సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లేబర్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు మంగళవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆభరణాల తనిఖీ

కరప, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కరప వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం అధికారులు ఆభరణాల తనిఖీ చేపట్టారు. దేవదాయ శాఖ జ్యువెల్లరీ వెరిఫికేషన్ ఆఫీసర్ విశ్వ పళ్లంరాజు సమక్షంలో అప్రయిజర్ శ్రీనివాస్ ఆలయ రికార్డుల ప్రకారం ఉన్న ఆభరణాలను తనిఖీచేశారు. స్వామి, అమ్మవార్లకు చెందిన 1.650 కిలోల బరువు కలిగిన 15 వెండి ఆభరణాలు, 2.250 గ్రాములున్న నాలుగు బంగారు ఆభరణాలను లెక్కించి అన్నీ సక్రమంగా ఉన్నట్టు నిర్ధారించారు. నిబంధనలను అనుసరించి మూడేళ్లకోసారి ఆభరణాలను తనిఖీ చేస్తామని అధికారులు తెలిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పెద్దింటి గోపాలకృష్ణ, దేవదాయ శాఖ సిబ్బంది చీర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన

గొల్లప్రోలు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం వద్ద అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా తయారుచేసిన వేదికపై అయ్యప్పస్వామిని ఉంచి పుష్పాలతో అలంకరించారు. అనంతరం గురుస్వాముల పర్యవేక్షణలో పడి పూజ జరిపారు. అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అసెస్‌మెంట్ క్యాంపు


కాకినాడ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల పిల్లలు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ కోరారు. పెగోడా నగరపాలక సంస్థ పాఠశాలలో మంగళవారం సమగ్ర శిక్షా సహిత విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. విద్యా శాఖ ఆర్జేడీ జి.నాగమణి, సమగ్ర శిక్షా ఏపీసీ పి.వేణుగోపాలరావు, ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేతన్‌కుమార్, అప్తమాలజిస్ట్ మధురిమ, సైకాలజిస్ట్ ప్రవీణకుమారి, ఐడస్ అసిస్టెంట్లు, ఐఈఆర్‌ఎఫ్ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలి'


తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయానికి సమిష్టి కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. మంగళవారం సామర్లకోట పట్టణ శివారు భాస్కర్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో ప్రత్యేక పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం పట్టణాల నూతన కార్యవర్గాల ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న నాయకులను గుర్తించి వారికి తగిన సమయంలో పదవులు ఇస్తామన్నారు. టీడీపీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు అడబాల కుమారస్వామి, ఎమ్మెల్యే చినరాజప్ప తనయుడు రంగనాగ్, రాజా సూరిబాబురాజు, అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్(బాబు), పాలకుర్తి శ్రీనుబాబు, మునిరెడ్డి శ్రీరాములు, ఎలిశెట్టి నాని, అందుగుల మణికుమారి, తాళాబత్తుల సాయి, చీకట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే చినరాజప్ప ఆవిష్కరించి వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'పిల్లల్ని చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి'


అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలల సంక్షరాధికారిణి (పాత చిత్రం)

సర్పవరం జంక్షన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని తల్లిదండ్రులు పిల్లలు కావాలనుకుంటే చట్టబద్ధంగా దత్తత తీసుకోవాల్సి ఉంటుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి జె.విజయ పేర్కొన్నారు. దత్తత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నేమాం శివారు పోలవరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల దత్తతపై తల్లులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సంతానం లేనివారు కావాలనుకుంటే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతాప్‌నగర్‌లో గల శిశుగృహ (ప్రత్యేక దత్తత సంస్థ)లో సంప్రదించాలని కోరారు. అనధికారికంగా పిల్లలను దత్తత తీసుకుంటే చట్టబద్ధంగా తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. సమావేశంలో అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాపక వేడుకలు


జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, రీజనల్ హెడ్ నాయుడు

కాకినాడ సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. రీజనల్ హెడ్ బీజీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జేఎన్టీయూకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులను, విశ్రాంత సిబ్బందిని సత్కరించారు. డిప్యూటీ రీజనల్ హెడ్ వింజమూరి కృష్ణమాచారి, సునీత సృష్టి, యూనియన్ నాయకులు జేఎన్వీ శ్రీనివాస్, ఆకుల సాంబశివరావు, పి.చంద్రశేఖర్, అడబాల శ్రీనివాస్, ఎం.దుర్గాప్రసాద్, రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీ పరిష్కారానికి తక్షణ చర్యలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో నమోదైన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ పేర్కొన్నారు. శాంతినగర్ ఎన్జీవో కాలనీలో పారిశుధ్య నిర్వహణపై స్థానిక న్యాయవాది పి.సుబ్బారావు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించారు. దీనిపై స్పందించిన కమిషనరు మంగళవారం ఉదయం స్వయంగా ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పారిశుధ్య పరిస్థితు లను సమీక్షించిన అనంతరం మాట్లాడుతూ స్థానిక ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. చెత్తను రోడ్డుపై వేయకుండా పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు మాత్రమే ఇవ్వాలని ప్రజలకు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వచ్చే నెల 13న మెగా లోక్ అదాలత్

పిఠాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో డిసెంబరు 13న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి తెలిపారు. కోర్టుల ఆవరణలోని బార్ రూమ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ మంచి వేదిక అన్నారు. పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి బాబు, ప్రిన్సిపల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిలు విజయరామేశ్వరి, వెంకట అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గమిదే

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం మంగళవారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అశోక్‌నగర్‌లో సంఘ అధ్యక్షుడు చింతలపూడి చిట్టిసత్తిరాజు ఇంట్లో బ్రాహ్మణ ప్రముఖులు దంటు భాస్కర్, శ్రీరామ్‌భగవతి, జీవీ కృష్ణ ప్రకాష్, అయ్యంగారి వెంకటేష్ ఆధ్వర్యంలో నూతన సంఘం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా అజ్జరపు సత్యనారాయణమూర్తి, అధ్యక్షుడిగా సీఎస్ఎస్ రాజు, ఉపాధ్యక్షులుగా రాయవరపు ప్రభాకరరావు, భమిడి శివమూర్తి, కార్యదర్శిగా చావలి వెంకటరామనాథం, కోశాధికారిగా బాలాంత్రపు రామకృష్ణ, ఉప కార్యదర్శిగా కప్పగంతుల వెంకట్‌లను ఎన్నుకున్నారు.



యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. ఏడీబీ రోడ్డులో మంగళవారం జరిగిన ఎంఎస్ఎంఈ పార్కు ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో ఎన్నో రాయితీలు అందిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటుచేసి వారికి అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, నిమ్మకాయల రంగనాగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రకోట వద్ద పేలుడు దురదృష్టకరం'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద జరిగిన పేలుడు ఘటనపై బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ ప్రయత్నాన్ని అయినా ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. నిందితులను గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించిందన్నారు.

లక్షపత్రి పూజ

గండేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా జడ్.రాగంపేటలో మంగళవారం రాజరాజేశ్వరి ఆలయంలో గ్రామానికి చెందిన కందుల కొండయ్యచౌదరి ఆధ్వర్యంలో భక్తుల ఆర్థిక సహాయంతో లక్షపత్రి పూజ, హోమం నిర్వహించారు. కంటే సురేంద్ర, కందుల వినయ్, బొడ్డు రామ్మూర్తి, కందుల విశ్వేశ్వరావు, కందుల నానిబాబు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. భారీ అన్నదానం జరిగింది.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పశుసంవర్ధక శాఖలో పదోన్నతులు

మారేడుమిల్లి ఏడీ సూర్యనారాయణమూర్తికి డీడీగా పదోన్నతి

అమరావతి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):పశుసంవర్ధక శాఖలో 24 మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా తాత్కాలిక పదోన్నతి కల్పించి, పోస్టింగ్‌లు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మారేడు మిల్లిలో పనిచేస్తున్న సూర్యనారాయణమూర్తిని శ్రీకాకుళం డీఎల్‌డీఏ ఈవో నియమించారు. కాగా, పశుసంవర్ధకశాఖకు పశువుల మందులు సరఫరా చేసిన కంపెనీలకు పెండింగ్‌లో ఉన్న రూ.70 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి, మళ్లీ మందుల కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రామకృష్ణ ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

పొల్లూరు జలపాతం వద్ద కార్తీక వన సమారాధన

మోతుగూడెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):చింతూరు మండలం మోతుగూడెం, పొల్లూరు కార్తీక వన సమారాధన పండుగ వాతావరణం నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు జిల్లాలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యక్రమంగా వారం రోజులపాటు నిర్వహించినట్లు తెలిపారు. కలెక్టర్ నుంచి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రకృతిని కాపాడటం, వాటి పాత్ర గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. లక్కవరం రేంజ్ అధికారి నానాజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు మోతుగూడెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను పొల్లూరు జలపాతం వద్దకు తీసుకువెళ్లి ప్రకృతి విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు అనంతరం ప్రతి విద్యార్థికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయుడు సాంసన్, సుజాత, తదితర ఉపాధ్యాయులు, ఫారెస్ట్ సిబ్బంది భాను ప్రకాష్, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

దేవీపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ రెండవ మండల మహాసభ మంగళవారం పోసమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభ సందర్భంగా సీఐటీయూ సీనియర్ నాయకురాలు కుంజం రాధమ్మ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల మహాసభ నిర్వహించి మండల కన్వీనర్ గా నడిపూడి వెంకటరెడ్డి, కో కన్వీనర్‌గా బంటుమల్లి నరసింహ, మరో 25 మంది కమిటీ సభ్యులతో ఎన్నుకున్నారు. ఈ మహాసభకు హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయని విమర్శించారు. ఈనెల 16, 17న రంపచోవడరంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అన్నవరం వాగుపై తాత్కాలిక బ్రిడ్జి పనులు ప్రారంభం

వీఆర్‌పురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం వాగుపై తాత్కాలిక బ్రిడ్జి పనులు మంగళవారం ప్రారంభించారు. బ్రిడ్జి కూలిపోయి 6 నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఈనెల 3వ తేదీన అఖిల పక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ 10వతేదీ నుంచి బ్రిడ్జి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. యిచ్చిన మాట ప్రకారం మంగళవారం నుంచి తాత్కాలిక బ్రిడ్జి పనులు ప్రారంభించడంతో అఖిలపక్షం నాయకులు కలక్టర్ దినేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'బిర్సా ముండాను ప్రతి గిరిజనుడు గుర్తుపెట్టుకోవాలి'

రంపచోడవరం, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులు, భూముల కోసం పోరాడిన బిర్సా ముండాను ప్రతి గిరిజనుడు గుర్తుంచుకోవాలని ఐటీడీఏ పీవో బచ్చు స్మరణ్ రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ధర్తీ ఆబ భగవాన్ బిర్సా ముండా 105వ జయంతి సందర్భంగా వివిధ పాఠశాల విద్యార్థులతో గిరిజన సంస్కృతిక కార్యక్రమాలు ఉట్టిపడేలా మాక్ పార్లమెంటరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ వరకు జన్ జాతీయన గౌరవ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.అంబేద్కర్, ఏపీవో(జీ) డీఎస్వీ రమణ, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏటీడబ్ల్యువో జి.తులసిదాస్, బుడమల మంగిరెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములపై గిరిజనేతరుల ఆక్రమణలు ఆపాలి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్

రంపచోడవరం, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల భూములపై గిరిజనేతరుల ఆక్రమణలను ఆపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో అంబేద్కర్, ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎస్వీ రమణలను కలిసి ఫిర్యాదు చేశారు. గిరిజనేతరులు గిరిజన చట్టాలకు విరుద్ధంగా భూములు కొనుగోలు చేసి గిరిజనులను బినామీలుగా చేసుకొని అక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు చోడి ప్రదీప్ కుమార్‌దొర, పీతా ప్రసాద్, పరదా శివరామకృష్ణ, కలుముల జోగిరాజుదొర, కడబాల శ్రీనుబాబు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలపై క్షేత్రస్థాయిలో చెప్పండి

● టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్‌యాదవ్

ఎటపాక, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి, విదేశాల నుంచి వస్తున్న పెట్టుబడుల రాకను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని, ఇక నుంచి గ్రామస్థాయిలో ప్రతీ కార్యకర్త, గ్రామకమిటీ అధ్యక్షులు, బూత్ ఇంచార్జ్‌లు పథకాలపై ప్రచారం చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. మంగళవారం ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతూనే పార్టీకోసం కష్టపడిన కార్యకర్తలకోసం ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పార్టీకోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. నాయకుల నుంచి కార్యకర్తలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, బూత్ ఇంచార్జ్‌లు అందరూ సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, తెలుగు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకన్న, పాటి చలపతి, చింతూరు టీడీపీ మండలాధ్యక్షుడు ఎండీ జమాల్‌ఖాన్, ముప్పా శ్రీనువాస్, పెనుబల్లి సాయిబాబు, రావిమాధవరావు, మాచినేని రాజేష్, పాయం దేవీ, కణితి మధు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలి

వీఆర్‌పురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలందరూ ప్రజలకు అందుబాటులో ఉండి వారధిగా పనిచేయాలని రంపచోడవరం నియోజనవర్గ ం టీడీపీ అబ్జర్వర్ కె.శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం రేఖపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రa నరేష్‌కుమార్ అధ్యక్షతన 10 మందిలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముత్యాల రామారావు, బొర్ర నరసింహారావు, ముత్యాల సిద్దార్థ, పాయం రామారావు, వాళ్ళ వెంకటేశ్వరరెడ్డి, గొంది చంద్రయ్య, మామిడి రాజు, పొడియం రాజు, ముత్యాల చంద్రశేఖర్, బొర్ర ఆదినారాయణ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

టిప్పర్ లారీలతో భయం.. భయం!

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజల ఆందోళన

గండేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రావెల్ తీసుకెళ్తున్న టిప్పర్ లారీలు గ్రామంలో నుంచి వెళ్లడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కె.గోపాలపురంలో గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. లారీలకు గ్రావెల్ వేసుకుని సుబ్బయమ్మపేటమీదుగా మల్లేపల్లి గ్రామం నుంచి హైవే నుంచి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఎక్కువగా ప్రజలు సంచరిస్తున్నప్పుడు, పిల్లలు రోడ్డుపై ఆడుకుంటునప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు లారీలు ఆపి ఇటు రావద్దని చెప్పినప్పటికీ రాత్రి వేళల్లో కూడా ఇటే వస్తున్నాయని పలువురు చెప్తున్నారు. దీని వల్ల రోడ్లు పాడైపోతున్నాయని ఆరోపిస్తున్నారు. లారీలు ఇటుగా రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గ్రావెల్‌తో రాత్రిపూట మల్లేపల్లి హైవేపై వెళుతున్న టిప్పర్

జగ్గంపేటలో ప్రజా సంఘాల ర్యాలీ



జగ్గంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

జగ్గంపేట/జగ్గంపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా భూమి, భుక్తి, విముక్తి కోసం అసువులు బాసిన అమరవీరులను స్మరించుకుంటూ జగ్గంపేటలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడీఎస్‌యూఎస్యు (వి), ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) ప్రజా సంఘాల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ట్రావెల్స్ బంగ్లా ఆవరణలో అమరవీరుల సంస్మరణ సభ పీడీఎస్‌యూ (వి)రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభ నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రజలు సమస్యలు పరిష్కారం కోసం అమరవీరుల పోరాట స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కుంచె అంజిబాబు, అధ్యక్షుడు మడికి సత్యం, ఏపీఆర్‌సీఎస్ జిల్లా నాయకులు కే.రామలింగేశ్వరరావు, ఎల్లే సత్తిబాబు, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) డొక్కులూరి సంగీత, నాయకులు రెడ్డి దుర్గాదేవి, చింతపల్లి రత్నం, మహాలక్ష్మి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని జగ్గంపేట వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్ చెప్పారు. రౌతుపాలెంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో ఆయన చిరుధాన్యాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు.


తొండంగిలో పీఎంశ్రీ పనులను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీడీ రెడ్డి

పీఎంశ్రీ పనుల నాణ్యతపై అసంతృప్తి

తొండంగి ఉన్నత పాఠశాలను సందర్శించిన అడిషనల్ ఎస్పీడీ

తొండంగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్టేట్ అడిషనల్ ఎస్పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి మంగళవారం తొండంగి ఉన్నత పాఠశాలను సందర్శించారు. పీఎంశ్రీ పథకంలో జరిగిన పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆట స్థలంలో జరిగిన పనుల నాణ్యత పై ఆయన ప్రశ్నించారు. పాఠశాల క్రీడా స్థలం పిల్లలు ఆడుకునేందుకు వీలుగా లేదన్నారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్ ఏర్పాటును ఆయన పరిశీలించారు. చెట్ల నీడన కిచెన్ గార్డెన్ ఉండడం, నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణను ప్రశ్నించగా తాను ఇటీవల బదిలీపై వచ్చానని, గతంలో ఉన్న హెచ్ఎం ఆధ్వర్యంలో పనులు జరిగాయన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రవీంద్రనాథ్‌రెడ్డి పరిశీలించి నాణ్యత మెరుగుపర్చాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన పాల్ ల్యాబ్‌ను ఆయన పరిశీలించి పనుల నాణ్యతను తనిఖీ చేశారు. ఆయన వెంట పాల్‌ల్యాబ్ స్టేట్ కోఆర్డినేటర్ కిరణ్, ఏఎంఓ జగన్మోహన్, ఎంఈవో సుబ్బిరెడ్డి తదితరులు ఉన్నారు.


బొద్దవరం బ్రిడ్జి నిర్మాణానికి చెక్కును అందజేసిన సతీష్‌బాబు ట్రస్ట్

వంతెన నిర్మాణానికి చెక్కు అందజేత

కోటనందూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బొద్దవరం గ్రామంలో తాండవ నది అవతల సాగు ఇబ్బందులను కాకినాడలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబుకు ప్రజాదర్బార్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. రైతులు వర్షాకాలంలో తాండవ నది అవతలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. నది అవతలకు వెళ్లడానికి రైతులు సొంత డబ్బులతో చిన్న వారధి నిర్మించుకున్నారు. దీనికి రెయిలింగ్ లేకపోవడంతో ఎంపీ సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ట్రస్ట్ తరపున రైతులకు రూ.1లక్షల చెక్కును జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అరిగెల శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా సానా సతీష్‌బాబు ఫౌండేషన్‌కు గ్రామ ప్రజలు తరపున రైతు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్‌న్యూటన్, చింతలపూడి అర్జున్, జున్నూరి బాబ్జి, వేగి గోపి, గెడ్డం కొండయ్య నాయుడు తదితరులు రైతులు పాల్గొన్నారు.

సింగపూర్ పర్యటనకు వెళ్లనున్న ప్రవీణ్

తొండంగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో అమలవుతున్న విద్యా ప్రమాణాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంపుతున్న బృందంలో పెరుమాళ్లపురం ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.ప్రవీణ్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు చాట్రాతి సత్యనారాయణ తెలిపారు. ఈనెల 27న ఆయన సింగపూర్ వెళతారని హెచ్ఎం తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

జగ్గంపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సర్కిల్ ఆఫీసును వార్షిక తనిఖీల్లో భాగంగా ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి సందర్శించారు. స్టేషన్ రికార్డులను, సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీస్ సంక్షేమ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య గతేడాది కంటే ఈ ఏడాది తగ్గిందని తెలిపారు. రోడ్డు ప్రమా దాలను అరికట్టడానికి తమ వంతు సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు శాంతి భద్రత సమస్యలు ఎదురైన తక్షణం పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి ఎస్‌లు రఘునాథరావు, శివనాగబాబు, సతీష్ ఉన్నారు.


జగ్గంపేటలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

అదుపులో శాంతి భద్రతలు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు పూర్తి అదుపులో ఉన్నాయని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. మంగళవారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి తనిఖీలు చేశారు. సర్కిల్ కార్యాలయ రికార్డులను, క్రైం రేటును పరిశీలించారు. డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐలు లక్ష్మీకాంతం, రామలింగేశ్వరరావు, ప్రసాద్ ఉన్నారు.

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పన, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. మంగళవారం అన్నవరం జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల అనుకుని మూడెకరాల విస్తీర్ణంలో రూ.15 కోట్లతో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టును సీడీపీ, ఏపీఐసీ క్యాపిటల్ నిధులతో అమలుచేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిన అన్నవరంలో ఇకపై పారిశ్రామికంగాను అడుగులు పడుతున్నాయని దీనిద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, నాయకులు వెన్నా ఈశ్వరుడు, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, బద్ది రామారావు పాల్గొన్నారు.

తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం

రౌతులపూడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో రెండు రోజులుగా ప్రజలు తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. మంచినీటిని అందించే ట్యాంక్ సంబంధించిన మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి బోరు వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోటారుకు మరమ్మతులు చేపట్టి మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వైభవంగా చీటికమ్మ జాతర

తుని రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవీమల్లవరం గ్రామంలో చీటికమ్మ జాతర కనుల పండుగగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. చీటికమ్మ జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పాతకొట్టాం శ్రీరామ భజన బృందానికి గుర్తింపు

కోటనందూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 23 ప్రధాన ఆలయాలకు ఆస్థాన భజన బృందంగా పాతకొట్టాం గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందానికి గుర్తింపు లభించింది. దేవదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయని భజన బృందం లీడర్ యడ్ల వరహాలబాబు తెలిపారు.

గౌరీ పార్వతుల నిమజ్జనం

కోటనందూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం గ్రామంలో గౌరీ పార్వతులు నిమజ్జనాన్ని ఘనంగా జరిపారు. గ్రామస్తులు మాతిరెడ్డి భాస్కరరావు, మాజీ సర్పంచ్ యర్ర చినసత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారిని సారెతో ఊరేగిస్తూ మెట్టింటికి పంపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మాతిరెడ్డి బాబులు, గొర్లిరాజు, బీమిరెడ్డి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో 986 గృహాల నిర్మాణం పూర్తి

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 986 గృహాల నిర్మాణం పూర్తయ్యిందని హౌసింగ్ డీఈ సువర్ణ రాజు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గృహాల మంజూరు కోసం పీఎం ఏవై పథకంలో యాప్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో అర్హులైన సర్వేలు నిర్వహించి అర్హులైన వారికి ఎంపిక చేస్తామన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల గృహాల్లో గృహ ప్రవేశాలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడులోని ఎస్టీకాలనీలో గృహాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించనున్నట్లు తెలిపారు.

ఖాదీబోర్డు వైస్ చైర్మన్‌గా కన్నబాబు నియామకం



ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు వైస్ చైర్మన్‌గా ప్రత్తిపాడుకు చెందిన కొమ్ముల తిరుపతి కుమార్ (కన్నబాబు)ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కన్నబాబును శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు.

వెలమ సంఘం ఇన్‌చార్జ్‌గా యమున



ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, జిల్లా సంఘ మహిళా కార్యదర్శిగా మండలంలోని ఏలూరు గ్రామ మాజీ సర్పంచ్ రొంగల యమున నియమితులయ్యారు. రాష్ట్ర కార్యవర్గం తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. యమునను పలువురు నాయకులు అభినందించారు.

పేదలకు అన్నదానం

జగ్గంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డొక్కాసీతమ్మ క్యాంటీన్‌లో జనసేన పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ నేతృత్వంలో సుమారు 500 మంది పేదలకు అన్నదానం చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

జగ్గంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీప్రజ్ఞ పాఠశాల ఆవరణలో 3రోజుల పాటు క్రీడాపోటీలు నిర్వహిస్తామని విజేతలకు బాలల దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని చైర్మన్ బి.నాగబాబు పేర్కొన్నారు.

కుక్కల స్వైర విహారంతో బెంబేలు


రౌతులపూడి సినిమా సెంటర్‌లో కుక్కల గుంపు

రౌతులపూడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి, బలరామపురం గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రౌతులపూడిలో జన సంచారం ఎక్కువగా ఉన్న సినిమా సెంటర్, హైస్కూల్‌కు వెళ్లే రహదారిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆయా పొలాల్లో కుక్కలు తిరుగుతూ లేగదూడలను చంపేస్తున్నాయని ఆరోపణలున్నాయి. నివాస ప్రాంతాలు, పాఠశాలలు, బస్టాండ్, థియేటర్ల ప్రాంతాల్లో కుక్కలు తిరగకుండా చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పును పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేకమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఖోఖో పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు. పక్క చిత్రంలో రోలర్ స్కేటింగ్ పోటీలో రజిత పతకాలు పొందిన విద్యార్థులు

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు

తుని రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఖోఖో పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 10 వరకు విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో అండర్-19 విభాగంలో ఎస్.శశికిరణ్, కె.కావ్యసుధ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ స్కేటింగ్ అసోసియేషన్ (కాకినాడ) ఆధ్వర్యంలో నవంబరు ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగిన రోలర్ స్కేటింగ్ పోటీల్లో టి.కళానిధి 500 మీటర్ల మిక్స్‌డ్ రిలే పోటీల్లో ప్రతిభచాటి రెండు రజిత పతకాలను కైవసం చేసుకున్నాడని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. ఈసందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్ వీకే నరసింహారావు అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, ప్రధానోపాధ్యాయురాలు సీతారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఆరోగ్య కేంద్రంగా ఏవీనగరం పీహెచ్‌సీ

తొండంగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ ఆరోగ్య కేంద్రంగా ఏవీనగరం పీహెచ్‌సీ ఎంపికైంది. కాయకల్ప కార్యక్రమంలో భాగంగా ఏపీ కుటుంబ ఆరోగ్య శాఖ కమిషనర్, వైద్య ఆరోగ్య నాణ్యతా ప్రమాణాల విభాగం, కేంద్ర ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో జిల్లాలో ఎంపికైన మూడు ఆరోగ్య కేంద్రాల్లో ఏవీనగరం ఆరోగ్య కేంద్రం ద్వితీయ స్థానంలో నిలిచింది. రోగులకు ఉత్తమ సేవలు అందించడం, పరిశుభ్రతతో పాటు ప్రభుత్వం అమలు చేస్తోన్న అన్ని పథకాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రూ.50 వేల నగదు పారితోషికంతో పాటు అవార్డుకు ఎంపికైంది. వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతిలను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య అభినందించారు.


ఏవీనగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం